


పాక బయటవున్న, గచ్చు అరుగుమీద కూర్చునున్న పోలయ్యకి వినపడుతున్నాయి. లోపలనుంచి మాటలు. చెవులోనుంచి, సగంలో ఆర్పేసిన పొగాకుతో చేసిన చుట్టని తీసి మళ్ళా వెలిగించుకున్నాడు పోలయ్య, వాళ్ళమాటలు వింటూ.

"ముసలాడికి ఉంచలేదా కూర?"

"వుంచలేదు. నువ్వు నంజుకో ముందర"

"ఇంకా ముసలాడికి అన్నం పెట్టలేదా?"

"తింటాడులే!"

"ఆకలి వేస్తుందేమో పాపం."

"ఎందుకు వేస్తుంది ఆకలి? నీలాగా ఫేక్టరీకి వెళ్ళి, నడుంవంచి పని చేస్తున్నాడా ఏమన్నానా? పొద్దుగూకులు ఆ అరుగుమీద కూర్చోవటమేగా ఆయన పని, అసలు అరగాలిగా తిన్నది."

"గట్టిగా అరవక వింటాడు."

"వింటే విననీ, ఉన్నమాటేగా."

కొడుకు కోడలు సంభాషణ విన్న పోలయ్య ఖాన గర్వితంగా నవ్వుకున్నాడు.

ముసలాడు తను. తిన్నది అరగదు. ఎంత తేలిగ్గా కోడలు అనగలి గింది ఆ మాటలు? తను ఇలా రోగిష్టిగా, జీవంలేని ముసలాడిగా కావ టానికి కారణం ఎవరు? ఎందుకూ పనికిరాని చెరకు పిప్పిలా మారిపోవడానికి కారణం ఎవరు? ఆ సంగతి ఎవరూ ఆలోచించరే ?

దేముడు మమత, ప్రేమ మనుషుల్లో సృష్టించాడు. తన కొడుకుల కోసం. కుటుంబం కోసం జీవితం అంతా కష్టపడ్డాడు. తన రక్తాన్ని ధార పోసి, చెమటని ఓడ్చి డబ్బు సంపాదించాడు. ముసలి వాడయ్యాడు తను. చివరికి ముసలాడయ్యాడు. ఆ గ్రహింపు, కృతజ్ఞతా లేదు వాళ్ళలో. తని ప్పుడు ఎందుకూ పనికిరాని మనిషి.

మౌనంగా చుట్టకాలుస్తూ, లోపలనుంచి ఇంకా వినబడుతున్న మాట లని వింటూ కళ్ళు మూసుకుని ఉండిపోయాడు పోలయ్య.

"ఆ బండి అమ్మేస్తే పోలా? దాన్ని ఎందుకు అలా అనవసరంగా దొడ్లో వుంచడం? ఏ అగ్గి అంటుకున్నా బుగ్గయిపోతుంది."

"ముసలాడు వినటంలేదుగా అది అమ్మితే మంచిదని చెప్పినా."

"సరే. ఆయన మనమాట వినటం కూడానా? మనమే అమ్మేయాలి. బండి ఖరీదు కూడా రాదు ఇంకా ఆలస్యం చేస్తే."

"చూద్దాం."

"చూద్దామంటే, చూస్తూనే కాలం గడిచిపోతుంది. పిల్లది సమర్తాడే వయసులో ఉంది. అది కాస్తా అయితే దాన్నో అయ్యచేతిలో పెట్టాలా? అప్పుడు డబ్బు అవసరం వస్తుంది. ఇప్పుడే ఆ బండిమీద వచ్చిన డబ్బు బేంకిలో వేసుకుంటె వడ్డీ వస్తుంది కూడా. ఆ బండి రూపంలో ఆ డబ్బంతా పడివుంటే ఏం లాభం?"

"సరే వీలు చూసుకుని కదుపుతాను."

ముసలి పోలయ్య మనస్సు బాధతో నిండిపోయింది. ఆ బండివిలువ తెలియదు వీళ్ళకి. ఇప్పుడు తన కొడుకు ఇంత పెద్ద వాడవగలిగాడంటె, ఆ బండిమీద వచ్చిన కిరాయి డబ్బుతోనే. తను బ్రతికుండగా అది అమ్మడానికి వీలులేదు.

"త్వరగా కేరియర్ సద్దు, ఇవాళ త్వరగా వెళ్ళాలి ఫేక్టరీకి, రాత్రి ఆలస్యంగా వస్తాను. ఓవర్ టైం చేస్తాను ఈ రాత్రి."

"ఇదుగో. అయిపోయింది."

పోలయ్య పక్కనుంచే వెళ్ళిపోయాడు, పోలయ్య కొడుకు. తండ్రిని గమనించనట్లుగానే, చేతిలో టిఫిన్ కేరియర్‌తో వెళ్తున్న కొడుకువంక చూస్తూండిపోయాడు పోలయ్య.

తను సవారీకట్టడం ఆపేసినప్పటి నుంచి ఎందుకో ఇలా మారిపోయాడు కొడుకు? భార్య బోధనలవల్లా లేక తను సంపాదించడం లేదనా? ఒంట్లో ఓపిక వున్నంతకాలం తనూ సంపాదించలా? ఆ సంగతి ఎందుకు అంత త్వరగా మర్చిపోతారు?

కోడలు భోజనానికి పిలుస్తుందనుకున్నాడు పోలయ్య. పిలిస్తే భోజనానికి వెళ్ళాలి అనుకున్నాడు. బాగా ఆకలి వేస్తోంది. కోడలు భోజనానికి పిలిస్తేగాని వెళ్ళకూడదను కున్నాడు.

సూర్యుడు నడినెత్తి మీదకి వచ్చేసాడుగాని కోడలు కనబడలేదు. ఎండ పడుతోంది అరుగుమీద.

నెమ్మదిగాలేచి, అరుగు పక్కన వున్న చేతికర్ర అందుకుని, కొంచెం దూరంలో వున్న బండివైపు నడిచాడు. బండిదగ్గరే నిలబడి చూసాడు దానివంక.

తన భార్యకన్నా ఆ బండే ఎక్కువ పరిచయం తనకి. తన ఏభై ఏళ్ళ జీవితంలో సగభాగం ఆ బండిలోనే గడిచిపోయింది దాదాపుగా: ఎన్నిసార్లో విరిగిపోయింది. ఎన్నిసార్లో బాగు చేయించాడు. ఎన్ని రాత్రులో ఆ బండిలోనే పడుకున్నాడు.

ఇప్పుడు గుర్రం లాగడానికి లేదు. దాన్ని తోలేందుకు తనలో సత్తువ లేదు. అలా పడివుంది తనలాగా. అది జీవంలేని బండి కాబట్టి దాన్ని అమ్మేయవచ్చు. తను జీవం వున్నమనిషి కాబట్టి, చచ్చేదాకా వేచి వుండాలి.

ఆ బండికి మంచి గుర్రం కట్టి, మళ్ళా ఆ బండిమీద సవారీ వెళ్ళాలని వుంది పోలయ్యకి. ఆర్థికంగానూ, శారీరకంగానూ తన కోరిక తీరడం కుదరదని తెలుసు.

"అన్నానికి."

వినపడీ, వినపడనట్లుగా కోడలు అన్న మాటలు విని వెనక్కి తిరిగాడు పోలయ్య.

వెనక్కి తిరిగి లోపలికి వెళ్ళిపోతోంది కోడలు, తనని పిలవటం అయిపోయినట్లుగా. కర్ర సహాయంతో పాకలోకి వెళ్ళాడు పోలయ్య.

గంజినీళ్ళు!

ఆకలిగా వుండటంవల్ల గబగబా ఆ గంజినీళ్ళే తాగాడు పోలయ్య.

మళ్ళీ బయటకి వచ్చి కూర్చున్నాడు పోలయ్య, ఎండ పడని మరో చోట. ఏమిటిది? ఎందుకు ఇంత పనికిరాని వాడుగా, అసహాయుడుగా అయిపోయాడు తను? పోలయ్య మనసులో మళ్ళీ కలుక్కుమంది బాధ.

కొడుకు రాగానే చుట్ట కొనుక్కునేందుకు డబ్బులు అడగాలి అనుకున్నాడు, జేబులు తడుముకుని, కిళ్ళీ కొట్టువాడు అప్పు ఇవ్వడం మానేసాడు, తన అసహాయత గమనించి.

చుట్ట తాగాలనే కోరికని బలవంతంగా అణుచుకున్నాడు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మనమరాలు కాఫీగ్లాసులు కడగటం చూసాడు.

కాఫీ లేదు ఈ రోజుకి తనకు అనుకున్నాడు మనస్సులోనే. కాఫీ లేకపోతే తలకాయనొప్పి వస్తుంది తనకి. దానికి తోడు ఓ చుట్టముక్క కూ నీకరువయింది.

సిగ్గువిడిచి, లేచివెళ్ళి ఆరుగంటల ప్రాంతంలో కోడలిని అడిగాడు కాఫీ కావాలని.

కాఫీపొడి అయిపోయింది. అన్న సమాధానం వచ్చింది వెంటనే.

కొద్దిగా వణుకు ప్రారంభం అయింది పోలయ్యలో జ్వరం మళ్ళీ వచ్చింది అని గ్రహించాడు వెంటనే. రోజూ సాయంత్రం వస్తుంది జ్వరం. రాత్రల్లా వుంటుంది. ఉదయం ఉండదు. ఇవాళ ఎక్కువగా ఉంది జ్వరం.

వెంటనే పాకలో ఓ మూల వున్న తన పక్కబట్టలు పరిచి పడుకున్నాడు పోలయ్య. దుప్పటి కప్పుకుంటే చలి, జ్వరం రెండూ ఎక్కువయినట్లుగా వున్నాయి.

కడుపులో ఆకలి. కాఫీ, చుట్ట లేకపోవటంవల్ల తలనొప్పి. వెంటనే నిద్ర పట్టేసింది పోలయ్యకి. అయినా, బాధలు మరిపించే ఇహాన్ని కాస్తసేపు దూరంచేసి నిద్రలోకి జారిపోయాడు పోలయ్య.

కల. ఆ నిద్రలో ఓ కల. కలనిపించలేదు పోలయ్యకు. నిజంగా జరుగుతున్నట్లుగానే వుంది.

బండి. అందంగా వున్న తవ గుర్రబ్బండి అది. ఆ బండికి వో చక్కటి తెల్ల గుర్రం కట్టి వుంది. ఆ గుర్రబ్బండిని తోలుతున్నాడు. వో పన్నెండేళ్ళ కుర్రాడు. ప్రక్కనే కూర్చుని ఎవరో నేర్పిస్తున్నారు ఎలా గుర్రబ్బండి తోలాలో.

పోలయ్య గుర్తు పట్టాడు ఆ ఇద్దరినీ. తనూ, తన నాన్న. తను గుర్రబ్బండి ఎక్కిన మొదటిరోజు సంఘటన అది. చేతిలోని కొరడాని ఝళిపిస్తున్నాడు. గుర్రబ్బండి వేగంగా పరిగెత్తుతోంది.

క్రమంగా బండివేగం తగ్గిపోతోంది. పూర్తిగా తగ్గిపోయింది. గుర్రం బండిని లాగలేక పోతోంది. బండిలోంచి కిందకి దిగాడు తను. బండికి కట్టి వున్న ఆ తెల్ల గుర్రాన్ని విప్పేసాడు.

పోలయ్య తన రూపాన్ని మళ్ళీ గుర్తుపట్టాడు, ఇప్పుడు పన్నెండేళ్ళ వాడు కాదు. ఇరవై అయిదేళ్ళవాడు. యువకుడు.

కాని గుర్రం ముసలిది అయిపోయింది. ఇక బండిని లాగే వోపిక, సత్తువ లేవు. ఆ గుర్రాన్ని తోలేసాడు తను.

మళ్ళీ బండి పరిగెత్తుతోంది ఇప్పుడు, మొదటిలోలాగా వేగంగా ఇప్పుడు. సరికొత్తగుర్రం. ఆ గుర్రం. మొహంమీద అందమయిన తెల్లని మచ్చ. పాతగుర్రం దిగులుగా చూస్తోంది తనవంక. దాని జాలిచూపులు తనని కరిగించలేదు.

మళ్ళీ ఆ గుర్రం వేగం తగ్గిపోయింది. ఆ గుర్రాన్ని తోలేసాడు బండి దిగి. ఇప్పుడు ముప్పై రెండేళ్ళు పోలయ్యకి. మరో కొత్త గుర్రం. మళ్ళీ మరో కొత్త గుర్రం. ఇప్పుడు నలభై మూడేళ్ళు. జుట్టు కొద్దికొద్దిగా నెరుస్తోంది. బండికూడా పాతదయిపోయింది.

తర్వాత పోలయ్య రెండేళ్ళ క్రిందటి రూపం. చివరికి గుర్రాన్ని కూడా తోలేసాడు, ఇదివరకటి లాగానే, నిర్దాక్షిణ్యంగా దాని ముసలితనంలో. కల మారింది.

పరిగెత్తాలి. తనని కొడుతున్నారు. ఎవరు? ఎవరో కొడుతున్నారు. పరిగెత్తాలి. పారిపోవాలి. ఇదేమిటి? తనతోపాటే దేన్నో లాగుతున్నాడు? పారిపోతూ తనకి కట్టబడ్డ దేన్నో ఈడ్చుకు వెళ్తున్నాడు. ఏమిటది?

తల వెనక్కి తిప్పిచూసాడు పోలయ్య పరిగెత్తుతూ.

బండి. గుర్రబ్బండి. తన గుర్రబ్బండి. తనకి. మెడకి. భుజాలకి కట్టారు బండిని. ఎవరు? దేనికి? ఎందుకు?

పరీక్షగా చూసాడు బండిమీద కూర్చునున్న ఆకారాన్ని. మసక, మసకగా వుంది ముందు. తర్వాత స్పష్టంగా కనిపించింది.

గుండె ఝల్లుమంది పోలయ్యకి. ఆ బండిమీద కూర్చుని, తనని కొరడాతో కొట్టేది గుర్రం! తను మొట్టమొదట సవారీ చేసిన తెల్ల గుర్రం!!

"ఎందుకు? నన్ను వదిలిపెట్టు."

అర్థించాడు పోలయ్య.

"నన్ను వాడుకుని, పీల్చి పిప్పిచేసి, నా ముసలితనంలో ఎందుకు నన్ను తరిమేసావ్? కసాయివాడు నన్ను పట్టుకోవడం చూసినా ఎందుకు వూరుకున్నావ్?" అడిగింది గుర్రం.

సమాధానం లేదు పోలయ్య దగ్గర.

"అందుకే పరిగెత్తు. పారిపో."

ఛళ్ళున కొరడాతో కొట్టింది మళ్ళీ.

మళ్ళీ పరిగెత్తుతున్నాడు పోలయ్య. ఒళ్ళు తెలియని భయంతో పరిగెత్తుతున్నాడు పోలయ్య. క్రమక్రమంగా బండి బరువు పెరిగిపోయింది.

రొప్పుతూ ఆగి వెనక్కి తిరిగి చూసాడు పోలయ్య.

మళ్ళీ గుండె ఝల్లుమంది.

నాలుగు గుర్రాలు ఇప్పుడు. తను ముసలితనంలో తరిమేసిన గుర్రాలు నాలుగూ బండిలో వున్నాయి ఇప్పుడు.

భీకరంగా సకిలించాయి పోలయ్యని చూసి. మళ్ళీ పరిగెత్తుతున్నాడు భయంగా. వోపిక తగ్గిపోయింది. దాహం వేస్తోంది. చెమటలు కక్కుతున్నాడు. కాళ్ళు తేలిపోతున్నాయి. వూళ్ళో అంతా తనని చూసి నవ్వుతున్నారు.

ఒక్కడుగు కూడా ముందుకి వేయలేకపోయాడు పోలయ్య, అలాగే పడిపోయాడు. నాలుగు గుర్రాలూ కొరడాలతో కొడుతున్నాయి లేవమన్నట్లుగా.

ఎవరో! ఎవరో అడ్డువచ్చారు; గుర్రాలవి దూరంగా పంపేసారు. చేత్తో తన వంటిని సున్నితంగా నిమిరారు. బాధ. నొప్పి, ఆయాసం అంతా ఎగిరిపోయాయి. లేచి నిల్చున్నాడు వెంటనే. బండి కూడా లేదు ఇప్పుడు.

ఎవరు? ఎక్కడో చూసినట్లుందే. ఎక్కడ? గుర్తుపట్టాడు పోలయ్య ఆ ముసలి అవ్వని. వో రోజు ఎండా కాలంలో నడిరోడ్డుమీద శోషకొట్టి పడివుంటే. ఆ ముసలిదాన్ని తన బండిలో ఎక్కించుకుని హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాడు తను, ఉచితంగా తర్వాత ఇంటికి చేర్చాడు.

చిన్నగా నవ్వింది ఆ ముసలిది. వెంటనే మాయమయింది అక్కడనుంచి. అయ్యో, దాహంగా వుంది. మంచినీళ్ళు అడగడం మర్చిపోయాడు తను.

లేచి కూర్చున్నాడు పోలయ్య, వోసారి చుట్టూ చూసాడు. పాకలాంతరు వెలుగుతోంది. ఇంతసేపూ జరిగింది నిజంకాదు. కల. తను నిద్రపోయ్యాడు. ఆ నిద్రలో కల వచ్చింది. అంతే, అబ్బ ఎంత భయంకరమయిన కల. నిజంగా జరుగుతున్నట్టుగానే వుంది, కల కంటున్నంతసేపూ.

ఇంకా జ్వరం తగ్గలేదు పోలయ్యకి. ఒళ్ళంతా నొప్పిగా వుంది. బాగా దాహం వేస్తోంది. లేచివెళ్ళి, కూజాలోనుంచి మంచినీళ్ళు. వంచుకుని తాగేశక్తి కూడా లేదు పోలయ్యలో.

అలా పక్కమీద కూర్చునే ఆలోచిస్తున్నాడు పోలయ్య. కలగురించి. ఆ గుర్రాలగురించి. అవి ముసలితనంలో తను తోలేసాక పడ్డ బాధ గురించి.

తన ముసలి తలిదండ్రులను వయసులో వున్నప్పుడు తను ఎలా నిర్లక్ష్యంగా చూసిందీ గుర్తుకు వచ్చింది పోలయ్యకి.

ఎందుకూ పనికిరాని వస్తువంటే లోకంలో అందరికి అయిష్టం. విసిరేస్తారు. అదే ప్రాణమున్న జీవమయితే తోలేస్తారు. తోలేయడం కుదరక పోతే ఆ వ్యక్తి చావుకోసం ఎదురు చూస్తూంటారు. మమత కన్నా డబ్బు ప్రాధాన్యం.

కొత్తేమీలేదు దీంట్లో, ఇది రివాజు. కేవలం రివాజు. మామూలు. పోకడ. అలవాటు. అంతే, ఈ రివాజు కొత్త విషయంగా కనబడుతోంది. తన విషయంలో అనుభవంలోకి రావడం వల్ల. కాని అనాలోచితంగా, రివాజుగా తనూ ఎంతమందిని కష్టపెట్టాడు. తన కొడుకు కూడా ఈ రివాజుకు గురవుతాడు.

తన బాధ కొంత తగ్గినట్లుగా భావించాడు పోలయ్య. ఇప్పుడు తను పడుతున్న బాధలకి కారణం వుసురు. ఆ గుర్రాల వుసురు. తన ముసలి తల్లిదండ్రుల వుసురు అంతే.

రేపు తన వుసురు కొడుక్కి, కొడుకు వుసురు మనమడికి అలా సాగి పోతూంటుంది. అలా సాగిపోవాలి.

ఎందుకంటే ఇది రివాజు.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక 19-1-1973 సంచిక)